క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



తమ్మినేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చింతాడ రవికుమార్ ఆమదాలవలసలో మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాంను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను తమ్మినేని అభినందించారు.

శివాలయం నిర్మాణానికి స్థలం మంజూరు



పట్టాను యూత్ సభ్యులకు అందజేస్తున్న అధికారులు

హిరమండలం: మండలంలోని సుభలయ ఆర్ అండ్‌ఆర్ కాలనీలో శివాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, చెగువేరా యూత్ సభ్యులు కలిసి తహసీల్దార్, జిల్లా కలెక్టర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందించారు. దీంతో స్థానిక తహసీల్దార్ హనుమంతురావు, ఉప తహసీల్దార్ బాలకృష్ణలు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఖాళీ స్థలాన్ని శివాలయం నిర్మాణానికి మంజూరు చేస్తూ పట్టాను యూత్ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదములు తెలియజేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

సరుబుజ్జిలి: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర అన్నారు. కళాశాలలో చదువుకున్న గోనెపాడు గ్రామానికి చెందిన గొండు చాందిని బాపట్ల వ్యవసాయ విద్యాలయంలో అగ్రికల్చర్ ఫుడ్ టెక్నాలజీలో సీటు సాధించిన సందర్భంగా మంగళవారం అధ్యాపక సిబ్బందిని ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో రమేష్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

17న సహస్ర సుందరకాండ పారాయణం



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈనెల 17న లోక కల్యాణార్థం సుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు స్థానిక వేంకటేశ్వరాలయంలో సుందరకాండ పారాయణానికి సంబంధించిన కరపత్రాన్ని, ఆహ్వాన పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. 1016 మంది భక్తులచే సహస్ర సుందరకాండ పారాయణం నిర్వహిస్తున్నామని లక్ష్మీ నరసింహ కోలాట బృందం ప్రతినిధి వారణాసి సంతోషి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్టీ చైర్మన్ పొట్నూరు వీరభద్రస్వామి, అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో తాడేల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు



నిందితులను చూపిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాష్ బేసిన్లు, మరుగుదొడ్లలో కుళాయిల చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన పొందూరు అప్పారావు, చింతలపూడి ప్రేమ్‌కుమార్‌లు ట్యాప్‌లు దొంగతనం చేసినట్లుగా గుర్తించామన్నారు. వారిరువురును రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

పాతపట్నం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ఎస్‌ఐ బి.లావణ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ వినియోగించినా, రవాణా చేసినా వారిపై శిక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ధరల మంట.. వంటకు తంటా..!



- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఆర్థిక ఇబ్బందుల్లో వంట మహిళలు



దేశవానిపేట స్కూల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న వంట ఏజెన్సీ మహిళలు

నరసన్నపేట: విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిత్యావసరాల ధరలు పెరుగుదల మంట పుట్టిస్తోంది. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత తగ్గుతోందనే విమర్శలు వస్తున్నాయి. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నా రుచిలో తేడాలు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ధరల ప్రభావం అటు సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంపై కూడా పడుతోంది.

నరసన్నపేట నియోజకవర్గంలో వివరాలు		
మండలం	స్కూల్స్	విద్యార్థుల సంఖ్య
నరసన్నపేట	82	4,772
జలుమూరు	83	3,615
సారవకోట	86	3,520
పోలాకి	96	4,402

గతంలో మార్పులు

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నిత్యవసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు మార్పులు చేస్తుండేవారు. దీంతో వంట ఏజెన్సీ మహిళలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదు. పథకం పేరు మార్చిందే తప్ప, అమలుకు తగిన చర్యలు తీసుకోవడం, మెనూ చార్జీలు పెంచడం లేదు. దీంతో వంట ఏజెన్సీలపై ఆర్థిక భారం పడుతోంది.

పెరిగిన ధరలు.. పాత చార్జీలు

ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. వంటనూనె రూ.30 పెరిగింది. కందిపప్పు సుమారు రూ.50 పెరిగింది. తెల్ల ఉల్లి, ఎర్ర ఉల్లి, జీలకర్ర, మెంతులు ఇలా ఆహార పదార్థాల్లో వినియోగించే అన్ని సరుకుల ధరలు భారీగా పెరిగాయి. అలాగే కూరగాయల ధరలు కోసం చెప్పనవసరం లేదు. దీంతో ఖర్చులు రెట్టింపయ్యాయి. కానీ ప్రభుత్వం మాత్రం పాత చార్జీలనే అమలు చేస్తోంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థికి రూ.5.88 పైసలు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 8.57 పైసలు ఇస్తోంది. గత ప్రభుత్వ కాలం నుంచీ ఈ ధరలే అమలవుతున్నాయి.

అప్పులు పెరుగుతున్నాయి



గతేడాదికీ ఇప్పటికి ధరలు బాగా పెరిగాయి. గడిచిన రెండు నెలల్లో అయితే మరింతగా పెరిగాయి. దీంతో వంట ఖర్చులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి. అలా అని మెనూలో ఎటువంటి మార్పులు చేయడం లేదు. ఆహార పదార్థాల రుచిలో తేడాలు చూపడం లేదు. దీంతో మాకు మాత్రం ఆర్థిక భారం ఎక్కువవుతోంది. ప్రభుత్వం సహృదయంలో ఆలోచించి మెనూ చార్జీలు పెంచాలి.

– కాంతమ్మ, వంట ఏజెన్సీ మహిళల సంఘం అధ్యక్షురాలు

నాణ్యత తప్పనిసరి



పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలి. ధరల పెరుగుదల ప్రభావంతో రుచిలో గానీ, మెనూలో గానీ తేడాలు ఉండకూడదు. అన్ని స్కూల్స్‌లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. వంట ఏజెన్సీ మహిళలకు తగు సూచనలు ఇస్తున్నాం.

– శాంతారావు, ఎంఈవో, నరసన్నపేట

పొంచి ఉన్న ప్రమాదం



పాతపట్నం మండలంలోని సీది గ్రామంలో జనావాసాల మధ్య ఉన్న రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లు పటుత్వం కోల్పోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. చిన్నారులు ట్యాంకు కిందే నిత్యం ఆడుతుంటారు. రోడ్డు పక్కన కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళన నెలకొంది. ఇటీవల నూతన ట్యాంకు నిర్మాణం చేపట్టి, పనులను సగంలోనే నిలిపివేశారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- పాతపట్నం

పేరుకుపోయిన గుర్రపుడెక్క



నరసన్నపేట మండలంలోని 2 వేల ఎకరాలకు సాగు నీరందించే కిల్లాం చానల్‌లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. దీంతో చివరి తడికి నీరు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాగే ఉంటే రబీ సీజన్‌కు అరకొరగానే నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొరిగివలస, రావులవలస, మాకివలస, కిల్లాం గ్రామాల రైతులకు ఈ కాలువే ఆధారం. అందువలన వంశధార ఇంజినీర్లు మేల్కొని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- నరసన్నపేట

తాగునీరు అందించరూ..!



హిరమండలం మండలంలోని పూనిపేట గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పనిచేయక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకం నిర్మించి, వాటికి కుళాయిలు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఎప్పుడూ సక్రమంగా తాగునీరు అందించిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేయించి, కుళాయిల ద్వారా తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

- హిరమండలం

సంక్షిప్తంగా..

నిలిచిన మడపాం ఇసుక ర్యాంపు

నరసన్నపేట: మడపాం వద్ద వంశధార నదిలో ఇసుక తవ్వకాలు నిలిచి పోయాయి. నదిలో తవ్వకాలకు అవకాశం ఇస్తూ గ్రామానికి చెందిన కూటమి నాయకులు రైతుల పేరున వసూళ్లు చేయడం బట్టబయలు కావడంతో వసూళ్లు నిలిపివేశారు. అలాగే ర్యాంపును కూడా నిలిపి వేశారు. 'కమిషన్ ఇస్తేనే పర్మిషన్' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం పబ్లిష్ కావడంతో వీరిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కలెక్షన్లు నిలిపి వేశారు. మంగళవారం ఉదయం నుంచి ర్యాంపు పూర్తిగా ఆపేశారు. మళ్లీ గ్రామంలో కూటమి నాయకులు మంతనాలు చేస్తున్నారని, రైతుల పేరిట వసూలు చేయడానికి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి గ్రామంలో ఏకాభిప్రాయం కుదరడం లేదు. మరో పక్క అనధికార వసూళ్లు లేకుండానే ట్రాక్టర్లకు ఇసుక తవ్వకాలకు అవకాశం ఇవ్వాలని ట్రాక్టర్ యజమానులు కోరుతున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

హిరమండలం: ఈనెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బైండోవర్ కేసు నమోదు

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ బొడ్డపాడు గ్రామంలో వ్యవసాయ భూముల కోసం తగువులు పడిన ఒక కుటుంబానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ వై.వి పద్మావతి ఆధ్వర్యంలో రూ.లక్షతో బైండోవర్ చేయించడం జరిగిందని ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక తెలియజేశారు. శాంతి భద్రతల దృష్ట్యా బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

పక్కాగా పౌష్టికాహారం పంపిణీ

మెళియాపుట్టి: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పక్కాగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని పాతపట్నం ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం, మర్రిపాడు.సి, జలకలింగుపురం, సిరియాఖండి గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో స్టాక్ రికార్డులు పరిశీలించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జలుమూరు: ప్రస్తుత సీజన్‌లో అపరాలైన మినప, పెసర, వేరుశనగ తదితర పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తలతరియా సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి రైతులతో మాట్లాడారు.

శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి శ్రీముఖలింగేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, పూజలు చేపట్టారు. పార్వతీపరమేశ్వరులను చక్కగా అలంకరించి ప్రత్యేక పూజలు అనంతరం తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బూర్జ: రోడ్డు ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక అన్నారు. మండలంలోని నీలంపేట, చిన్నలంకాం, టీఆర్ రాజుపేట గ్రామాల్లో పలు నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా అవగాహన కల్పించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎంపీపీ మురళి



జలుమూరు: మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

ఎల్.ఎన్.పేట: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ఎంతో అవసరమని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రెండు రోజులు పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు మండల స్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులకు శిక్షణ ఉంటుందన్నారు. రెండో రోజు బుధవారం ప్రజాప్రతినిధులతో శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ ప్లానింగ్ కమిటీ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: పంచాయతీ రాజ్ చట్టాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన ఉండాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలని మండల అధికారులకు ఎంపీడీవో పి.చంద్రకుమారి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అధికారులకు, సెక్రటరీలతో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతి పట్నాయక్, ఈవోపీఆర్డీ వెంకటరావు, హౌసింగ్ ఏఈ సీతారాంరాజు, ఏపీవో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ మోహన్, ఈవోపీఆర్డీ ప్రభాకర్, విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: పంచాయతీల సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో నీరజ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ వసంత కుమారి, ఏవో బసప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలే కీలకమని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఈవోపీఆర్డీ రేణుక, జిల్లా పరిషత్ మాజీ సభ్యుడు చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని డీఎల్‌పీవో గోపీ బాల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, ఏపీఎం త్రినాథమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రణాళికలు చేసుకుంటే పంచాయతీలు అభివృద్ధి బాటలో నడుస్తాయని ఎంపీడీవో రోణంకి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ డవలప్‌మెంట్ ప్లాన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.వాసుదేవరావు, ఈవోపీఆర్డీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఊసెత్తని బడ్జెట్



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

హిరమండలం: కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులే చేసిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. మంగళవారం హిరమండలం, భగీరథిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ, డీఏ బకాయిలు, పెండింగ్ పీఎఫ్, రుణాలు, పాత పెన్షన్ విధానం అమలుకు కేటాయింపులు లేకుండా ఉద్యోగులను మోసం చేశారని చెప్పారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటం తప్పదన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, మండల అధ్యక్షుడు బి.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడు మృతి



సంతోష్‌కుమార్ బిషాలో (ఫైల్)

మెళియాపుట్టి: దైవకార్యక్రమానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగరాజపురం గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ బిషాలో (36) మంగళవారం ఏకాదశి సందర్భంగా సుమారు 40 మంది గ్రామస్తులతో కలిసి మెళియాపుట్టిలో ఏకాహం భజనకు వెళ్లాడు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో సుందరాడ గ్రామానికి వెళ్తుండగా పెద్దపద్మాపురం గ్రామశివారులో సంతోష్ కుమార్ ట్రాక్టర్ పైనుంచి జారిపడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం కాలేదు. తల్లిదండ్రులు అర్జున్, బృందావతి సోదరి, ఇద్దరు సోదరులు ఉన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉచిత ఇసుక పేరుతో లూటీ



గంగరాపు సింహాచలం

కొత్తూరు: ఉచిత ఇసుక పేరుతో తెలుగు తమ్ముళ్లు నదులను లూటీ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంగరాపు సింహాచలం అన్నారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఉచిత ఇసుక పేరు చెప్పి జిల్లాలో పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు అక్రమంగా ఇసుక తవ్వుతున్నారని ఆరోపించారు. ఈ తవ్వకాలపై కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారుల వరకు చోద్యం చూస్తున్నారని అన్నారు. కొత్తూరు మండలంలోని నివగాం, ఆకులతంపర వద్ద ఇసుక అక్రమాలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని విమర్శించారు. పగలంతా తవ్వి రాత్రి తరలిస్తున్నారని, ఒడిశా బిల్లులతో మాయ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలు ఆపాలని కోరారు.

అకాల వర్షంతో అవస్థలు



వర్షం పడటంతో టార్పాలిన్లపై నిల్చిన నీరు

సారవకోట: మండలంలో మంగళవారం దాసుపురం, ధర్మలక్ష్మీపురం, పాతూరు, బొంతు చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు అవస్థలు పడ్డారు. ప్రస్తుతం ముమ్మరంగా వరి కోతలు చేపడుతూ ధాన్యం ఆరబెట్టారు. అయితే వర్షం కురవడంతో ఆరబెట్టిన ధాన్యం కుప్పలుగా పెట్టి తడిచి పోకుండా వాటి పై టార్పాలిన్లు కప్పి ఉంచారు.

15న బిర్సాముండా జయంతి



అధికారులతో మాట్లాడుతున్న సీతంపేట ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవన సముదాయంలో స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా జయంతిని ఈనెల 15న నిర్వహించనున్నట్లు సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతూ అన్ని శాఖల నుంచి స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ సిమ్మన్న, ఏఈ శ్రీకాంత్, ఐటీడీఏ పీహెచ్‌వో గణేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో కుటుంబాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రంజిత్

పోలాకి: డ్రగ్స్ వాడకంతో కుటుంబాలు నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ రంజిత్ అన్నారు. మండలంలోని బెలమర జంక్షన్, ప్రియాగ్రహారం, పిన్నింటిపేటల్లో సంకల్పం పేరుతో అవగాహన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. చట్ట ప్రకారం డ్రగ్స్ వాడినా, అమ్మినా నేరమని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఇలాంటి చెడు వ్యసనాల ప్రభావంతో ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.